

ఆలయానికి విరాళం

నాదెండ్ల: సాతులూరులోని గ్రామ దేవతల ఆలయ భోజనశాల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త కేవీ రెడ్డి రూ.51,116 విరాళంగా అందించారు.



కార్తికేయుని సన్నిధిలో ..

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని విజిలెన్స్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఎల్.వి.రమణమూర్తి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు.

శాకంబరిదేవిగా సీతాలాంబతల్లి



నాదెండ్ల: సాతులూరులోని బండారుపల్లి వారిపాలెంలో కొలువై ఉన్న సీతాలాంబతల్లిని ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం శాకంబరిదేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నిండుకుండలా విప్పర్ల చెక్‌డ్యాం



విప్పర్ల(క్రోసూరు): వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని విప్పర్ల చెక్ డ్యాంకు భారీగా నీరు చేరింది. చెక్‌డ్యాం నిండుకుండలా తొణికిసలాడుతుంది. వేసవి కాలంలో పంట పొలాలకు నీరు పెట్టుకునేందుకు ఉపయోగపడే విధంగా 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన చెక్ డ్యాంలో ఇప్పటికీ కొద్ది మేర నీరు నిలువ ఉంటుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెక్ డ్యాం నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు

జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలోని ఇసుక రీచ్‌ల్లో 2021–2024 కాలానికి అక్రమ తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. శాటిలైట్ ఛాయా చిత్రాల ఆధారంగా 126హెక్టార్లలో ఇసుక అక్రమ తవ్వకాల విషయంలో సంబంధిత సంస్థలను బాధ్యులుగా నిర్ధారించాలన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. మాచర్ల నియోజకవర్గంలో నూతన ఇసుక స్టాక్ పాయింట్‌ను వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో అక్టోబరు 15 వరకు ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంటుందని, అప్పటివరకు తవ్వకాలను నిరోధించేందుకు జిల్లా, మండలస్థాయి టాస్క్‌ఫోర్సులు పని చేస్తాయన్నారు. అదనపు ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా మైన్స్ జియాలజీ అధికారి నాగిని, ఆర్డీవోలు రమణాకాంతరెడ్డి, మురళీకృష్ణ, భూగర్భ జలశాఖ ఏడీ రామబాలాజీరెడ్డి, పిడుగురాళ్ల ఎంపీపీ రాంబాబు పాల్గొన్నారు.


లైంగిక వేధింపులకు పాల్పడిన వీఆర్వో సస్పెన్షన్

బెల్లంకొండ: వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడిన నాగిరెడ్డిపాలెం వీఆర్వో డి.వెంకయ్యను సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేషన్ కార్డులో పిల్లల పేర్లు మార్పు కోసం దరఖాస్తు చేసుకున్న వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో, సదరు మహిళ వీఆర్వో వేధింపులను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో వీఆర్వోను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు ఉత్తర్వులు పంపించారు.

సమ్మె విరమించిన మున్సిపల్ కార్మికులు

నరసరావుపేట: తమ డిమాండ్ల సాధన కోసం ఇంజనీరింగ్ కార్మికులు గత పది రోజుల నుంచి చేస్తున్న సమ్మెను మంగళవారం నుంచి తాత్కాలికంగా విరమించారు. ఈ మేరకు సీఐటీయు నాయకులు షేక్ శిలార్, చిన్న అల్లా బక్షు, కార్మికులు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును కలిసి తెలియచేశారు. షేక్ శిలార్ మాట్లాడుతూ కార్మికుల జీతాలను ప్రభుత్వం పాక్షికంగా పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో తాము సమ్మెను తాత్కాలికంగా విరమించామన్నారు.

568.30 అడుగులకు సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 568.30 అడుగులకు చేరింది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నరసరావుపేట మున్సిపాలిటీకి 14వ ర్యాంకు



నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో స్థానిక మున్సిపాలిటీకి 14వ ర్యాంకు లభించిందని కమిషనర్ ఎం.జస్వంతరావు మంగళవారం పేర్కొన్నారు. గతేడాది 18వ ర్యాంకు వచ్చిందన్నారు. ఈ ఏడాది ర్యాంకు పరంగా పరిస్థితి మెరుగుపడిందన్నారు. దేశ వ్యాప్తంగా 265వ ర్యాంకు సాధించటమే కాకుండా చరిత్రలో తొలిసారిగా ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (ఓడీఎఫ్)లో 2ప్లస్ ర్యాంకు లభించిందన్నారు.

పచ్చనేత గ్రావెల్ దందా

- ఇసుకదర్శి, వలపర్లల్లో కొండలు తవ్వి గ్రావెల్ అమ్మకం
- వంద ట్రిప్పర్లతో గ్రావెల్ అక్రమ రవాణా
- రాత్రి, పగలు తేడా లేకుండా తరలింపు
- వాడరేవు– పిడుగురాళ్ల హైవేకు గ్రావెల్
- పర్చూరు, చీరాల, బాపట్ల రియల్ వెంచర్లకు ఇక్కడి నుంచే సరఫరా
- ట్రిప్పర్ రూ.10 వేలు, ట్రాక్టర్ రూ.3 వేలు
- రోజుకు వెయ్యి ట్రక్కుల గ్రావెల్ తరలింపు
- అనుమతులున్న గ్రావెల్ లీజులు రద్దు చేయించిన వైనం
- అక్రమ రవాణాపై స్పందించని మైనింగ్ అధికారులు



మార్టూరు మండలం ఇసుక దర్శి, వలపర్ల వద్ద కొండలను పిండి చేసి గ్రావెల్‌ను తరలిస్తున్న పచ్చనేత

సాక్షి ప్రతినిధి,బాపట్ల: పర్చూరు పచ్చనేత బరితెగించారు. పేదల కడుపు కొట్టడమేకాకుండా ప్రకృతి వనరులనన్నింటినీ కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నారు. అక్రమార్జనకు కాదేదీ అనర్హం అనే రీతిలో రేషన్ బియ్యంతోపాటు గ్రానైట్, గ్రావెల్, ఇసుక అక్రమంగా అమ్ముకుంటున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించకుండా రోజుకు 80 లారీలకు పైగా గ్రానైట్ పలకలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. చినగంజాం మండలం కడవకుదురు ప్రాంతం నుంచి నిత్యం ఇసుకను లారీల్లో హైదరాబాద్ తరలించి పెద్ద ఎత్తున అక్రమార్జనకు పాల్పడుతున్నారు. మరో వైపు మార్టూరు ప్రాంతంలోని కొండలను పిండిచేసి అమ్ముకుంటున్నారు. పర్చూరు పచ్చనేత అక్రమ వ్యాపారాలు ఇప్పుడు జిల్లా పచ్చ పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. ఈయన వ్యవహారం ఆ పార్టీ అధిష్టానంలోనూ చర్చకు దారితీసినట్లు సమాచారం.

రైతుల భూముల్లోనూ తవ్వకాలు

పర్చూరు పచ్చనేత నేత మార్టూరు మండల పరిధిలో ఉన్న ఇసుకదర్శి, వలపర్ల ప్రాంతాల్లో ఉన్న కొండలను పిండిచేసి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. కొండలతోపాటు ఇదే ప్రాంతంలోని సర్వే నంబర్ 558లోని ప్రభుత్వ భూములతోపాటు ఈ ప్రాంతాల్లోని పలువురు రైతులకు చెందిన భూముల్లోనూ పచ్చనేత అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించినట్లు తెలుస్తోంది. అధికారపార్టీ ముఖ్యనేత కావడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఉన్నట్లు సమాచారం.

'రియల్' తరలింపు

వాడరేవు– పిడుగురాళ్ల జాతీయ రహదారితోపాటు పర్చూరు, చీరాల, బాపట్ల ప్రాంతాల్లోని రియల్ వెంచర్లు, రోడ్ల నిర్మాణంతోపాటు పలు రకాల అవసరాలకు విక్రయిస్తున్నారు. రోజుకు ఇక్కడి నుంచి 100 ట్రిప్పర్లు, వందకుపైగా ట్రాక్టర్లతో గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రధానంగా వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ రహదారి పనులకూ గ్రావెల్ అమ్ముతున్నారు. రోడ్డు కాంట్రాక్టర్లకు ట్రిప్పర్ గ్రావెల్‌ను రూ.4 వేలకు విక్రయిస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు స్వయంగా ట్రిప్పర్‌తో గ్రావెల్ సరఫరా చేసి ట్రిప్పుకు రూ.15 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఒక్క రోడ్డుపనికే రోజుకు వందలాది ట్రిప్పుల గ్రావెల్ తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇక్కడి నుంచే ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ సరఫరా చేస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్‌ను దూరాన్ని బట్టి రూ.2 నుంచి రూ.మూడు వేలకు విక్రయిస్తున్నారు. ఈ లెక్కన పచ్చనేత రోజు రాబడి రూ.లక్షల్లో ఉన్నట్లు సమాచారం.

తెలుగు యువత నేత పర్యవేక్షణ

ఈ మొత్తం దందాను పర్చూరు పచ్చనేత అనుచరుడుగా ఉన్న తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన తెలుగు యువతనేత శ్రీకాంత్ నడిపిస్తున్నారు. తానే స్వయంగా దగ్గరుండి అక్రమంగా గ్రావెల్ తరలింపు వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. మరికొందరు అనుచరులను పెట్టుకొని దందా నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ రాబడికి గండి

గత ప్రభుత్వంలో పర్చూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వం గ్రావెల్ కోసం లీజులు మంజూరు చేసింది. మార్టూరు మండలం బొబ్బేపల్లి, కోలలపూడి, వలపర్ల, బొల్లాపల్లి ప్రాంతాల్లో పదుల సంఖ్యలో లీజులు ఉండేవి. దీనివల్ల ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వచ్చేది. జిల్లాకు, మైనింగ్ పరిధిలోని గ్రామపంచాయతీలకు నిధులు సమకూరేవి. వాటితో అభివృద్ధి పనులు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఉన్న బొబ్బేపల్లి పరిధిలోని లీజులను రద్దు చేయించారు. కోలలపూడి, వలపర్ల, బొల్లాపల్లి ప్రాంతాల లీజులను రద్దు చేయకపోయినా అధికారం అడ్డుపెట్టి అక్కడ మైనింగ్ జరగకుండా నిలిపివేయించారు. ప్రస్తుతం పచ్చనేతే మైనింగ్ చేస్తున్నారు.

కూటమి రాకతో దోపిడీ

కూటమి అధికారంలోకి రాగానే పాత లీజుల నుంచి మైనింగ్ జరగకుండా అడ్డుకున్న పచ్చనేత తాను మాత్రం ఎటువంటి లీజు, అనుమతులు లేకుండానే ఇసుకదర్శి, వలపర్ల తదితర అటవీ ప్రాంతాల నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించి కోట్లు కొల్లగొడుతున్నారు. కూటమి సర్కార్ కొలువుదీరేవరకూ పచ్చగా ఉన్న కొండలు ఇప్పుడు తరిగిపోయి బోళ్లుగా మారిపోయాయి. గ్రావెల్ తరలింపుతో కొన్ని ప్రాంతాలు దాదాపు కనుమరుగయ్యాయి. గతంలో ద్రోణాదుల మరి కొన్ని ప్రాంతాల నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలించి విక్రయించారు. పర్చూరు నేత అక్రమ



గ్రావెల్ దందాతో ప్రభుత్వ రాబడికి రూ.కోట్లలో గండి పడుతోంది. అయినా సంబంధిత శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్రమశిక్షణతో జీవితాన్ని అవలంభించాలి

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జియాఉద్దీన్



సబ్‌జైలును పరిశీలిస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియాఉద్దీన్

రేపల్లె: క్షణికావేశాన్ని వీడి క్రమశిక్షణతో జీవించాలని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియాఉద్దీన్ చెప్పారు. పట్టణంలోని సబ్‌జైలును మంగళవారం సందర్శించి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. జైలులో అందుతున్న వసతులపై అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై అవగాహన కల్పించటంతోపాటు ప్రభుత్వ న్యాయ సేవలను పొందే విధానాన్ని తెలుసుకోవాలన్నారు. సబ్‌జైలులోని పరిసరాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట న్యాయవాది గుమ్మడి కుమార్‌బాబు ఉన్నారు.

న్యాయవాదులపై దాడులు హేయం

విధులు బహిష్కరించి నిరసన

చీరాల రూరల్: కక్షిదారులకు నిత్యం సహాయం అందించే న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గొరవ రమేష్‌బాబు, మేరుగ రవి కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఇటీవల బెజవాడ, తణుకు బార్ అసోసియేషన్‌లకు చెందిన న్యాయవాదులను కొందరు కిడ్నాప్ చేసేందుకు యత్నించి హత్య చేసేందుకు పథక రచన చేశారని చెప్పారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడో ఒకచోట జరుగుతునే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎక్సైజ్ శాఖకు టోపీ

- లైసెన్స్ ఫీజును చెల్లించని చీరాల మద్యం వ్యాపారి
- రూ.1.92 కోట్ల బకాయి
- నోటీసు జారీ చేసిన జిల్లా ఎక్సైజ్ శాఖ



చీరాల:చీరాల్లో పేరొందిన మద్యం వ్యాపారి ఎక్సైజ్ శాఖకు పెద్ద మొత్తంలో చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజును చెల్లించలేదు. దీంతో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేసిన సంగతి మంగళవారం వెలుగుచూసింది. చీరాలలో లిక్కర్ సిండికేట్ నాయకుడు, టీడీపీ నాయకుడు.. బినామీ పేరుతో నడుపుతున్న శ్రీకృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ ప్రభుత్వానికి కోటీ 92 లక్షల 50వేల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉంది. అతనికి చెందిన బార్‌లోనే మేనేజర్‌గా పనిచేసే శ్రీధర్ పేరుతో కృష్ణ రెస్టారెంట్ అండ్ బార్ పేరుతో ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో ఒక టెండరును దక్కించుకొన్నాడు. అయితే ఆ బార్ అండ్ రెస్టారెంట్‌కు సంబంధించిన 2022–2025 కాలానికి లైసెన్స్ ఫీజును నేటికీ చెల్లించలేదు. దీంతో ఎక్సైజ్ శాఖ బాపట్ల జిల్లా అధికారి ఈ మేరకు లైసెన్స్‌దారునికి నోటీసులు పంపించారు.

ఈనెల 17న నోటీసులు పంపించినా..

రాజకీయ పలుకుబడి కారణంగా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఈ మద్యం వ్యాపారికి చీరాలలో ఒక బార్ అండ్ రెస్టారెంట్‌తోపాటు చీరాల సబ్‌డివిజన్ పరిధిలో నాలుగు వైన్ షాపులు, అనధికారకంగా వేలంలో దక్కించుకున్న బెల్టు షాపులు నిర్వహిస్తున్నాడు. అధికార పార్టీ అండతో గ్రామగ్రామాన, తీర ప్రాంతంలోని రిసార్టులకు, హోటళ్లకు అతని అనుచరులు 24 గంటలు మద్యం సరఫరా చేస్తున్నా ఎక్సైజ్‌శాఖ మాత్రం కన్నెత్తి చూడకపోవడం విశేషం. ఈనెల 17న నోటీసులు పంపించినా చర్యలు తీసుకోలేదు.

బెల్టు షాపులకు మద్యం

టీడీపీ నేతల ఆధ్వర్యంలో చీరాల నియోజకవర్గంలో మద్యం బెల్టు షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పట్టణం నుంచి రూరల్ గ్రామాలకు మద్యం కేసులు దర్జాగా తీసుకెళుతున్నా ఎక్సైజ్ శాఖ పట్టీపట్టనట్టుగా వ్యవహరించడం గమనార్హం. సోమవారం పట్టపగలు చీరాలలోని కృష్ణా వైన్స్ నుంచి 25 కేసులు మద్యం ఆటోలో వేటపాలెం మండలం కటారివారిపాలేనికి తరలించారు. అక్కయ్యపాలెం వద్ద మీడియా ప్రతినిధులు ఆటోను నిలిపి ఆటో డ్రైవర్‌ను అడుగగా టీడీపీ నేతలు గవిని పోతురాజు, తేజ అనే వారు ఈ మద్యాన్ని తన వాహనంలో లోడ్ చేశారని ఆటోడ్రైవర్ చెప్పారు. ఆటోలో బెల్టు షాపులకు మద్యం రవాణా చేస్తున్నారని మీడియా ప్రతినిధి చీరాల ఎక్సైజ్ అధికారులకు చెప్పగానే వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడం కొసమెరుపు. బెల్టుషాపులను ప్రోత్సహించబోమని కూటమి ప్రభుత్వం చెబుతున్నా.. చాటుమాటున బెల్టు షాపులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. అక్రమ సారా తయారీపై ఉక్కుపాదం మోపుతున్నామని చెబుతున్న ఎక్సైజ్ శాఖ.. బెల్టు షాపుల వైపు కన్నెత్తి చూడటం లేదు.

మహిళను రక్షించిన పోలీసులు

- ఆత్మహత్యాయత్నం నుంచి కాపాడిన వైనం
- ఆధునిక టెక్నాలజీతో మహిళ ఆచూకీ



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను రక్షించిన పోలీసులు

చీరాల అర్బన్: రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించిన మహిళను చీరాల ఒన్‌టౌన్ పోలీసులు సురక్షితంగా కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. చీరాల గంజిపాలేనికి చెందిన వివాహిత అమల ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడేందుకు మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చింది. బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. అయినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో వారు చీరాల ఒన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు హుటాహుటిన సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో చీరాల–వేటపాలెం రైల్వేట్రాక్‌పై జల్లెడ పట్టారు. వేటపాలెం రైల్వేస్టేషన్ వద్ద రైలు పట్టాలపై ఉన్న ఆమెను గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒత్తిడికి లోనై అనాలోచిత నిర్ణయాలతో ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. వెంటనే స్పందించి మహిళను సురక్షితంగా అప్పగించిన పోలీసులకు మహిళ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

సాగుకు శ్రీకారం



వల్లువారిపాలెంలో వెద పద్ధతిలో నాటేందుకు మిషన్‌లో విత్తనాలు పోస్తున్న రైతులు



సమ్మెటవారిపాలెంలో విత్తనాలు చల్లుతున్న రైతులు

- నార్లు పోసుకునే పనిలో రైతులు
- వెద పద్ధతిలో సాగుకు సన్నాహాలు
- ఎంటీయూ 1262 రకం వైపే రైతుల మొగ్గు

బాపట్లటౌన్: గడిచిన మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం నారుమడుల కోసం కొందరు రైతులు విత్తనాలు పోస్తుండగా మరి కొందరు నేరుగా వెద పద్ధతిలో సాగుకు శ్రీకారం చుడుతున్నారు. నిన్నటి వరకు బీడు భూములను తలపించేలా ఉన్నటువంటి పొలాలను సైతం దుక్కిదున్నించడం, వాటిల్లో ఎరువులు తోలే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

బీపీటీ 5204, ఎంటీయూ 1262 వైపు రైతుల చూపు

బాపట్ల నియోజకవర్గంలో బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లోని రైతులు అత్యధిక శాతం సన్న రకాల్లో రారాజుగా రాణిస్తున్న బీపీటీ 5204తోపాటు ఎంటీయూ 1262 రకాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా నల్లరేగడి నేలల్లో అత్యధికంగా బీపీటీ సాగుచేస్తుండగా తీర ప్రాంతాల్లోని ఇసుక నేలల్లో రైతులు అత్యధికంగా ఎంటీయూ 1262 రకం సాగు చేస్తున్నారు. తక్కువ కాలంలో పంట చేతికి రావడంతోపాటు, చీడపీడలను తట్టుకొనే సామర్థ్యం ఉండటం, దిగుబడులు నేలస్వభావాన్ని బట్టి ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు వస్తుండటంతో రైతులు ఎంటీయూ 1262 రకం వైపు మొగ్గుచూపుతున్నారు.

వెద పద్ధతికే రైతుల మొగ్గు

రైతులు మూడేళ్ల నుంచి అధికంగా వెద పద్ధతికే మొగ్గు చూపుతున్నారు. వెద పద్ధతిలో సాగుచేస్తే పైరు నీటి ఎద్దడిని తట్టుకోవడంతోపాటు, తక్కువకాలంలోనే పంటచేతికొచ్చే అవకాశం ఉందన్నారు. వీటితోపాటు నారుపెంచడం, దమ్ముచేయటం, నాటు వేయించడం లాంటివి కలుపుకొని ఎకరాకు సుమారు రూ.5 నుంచి 7 వేల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉందన్నారు. బాపట్ల, కర్లపాలెం మండల గ్రామాల్లోని రైతులు వెద పద్ధతిలో అధికంగా సాగుచేస్తున్నారు. పిట్టలవానిపాలెం మండలంలో చాలావరకు రైతులు గడిచిన 10 రోజుల కిందటే నారుమడులను సిద్ధం చేసుకొని నార్లు పోసుకోగా మెరక ప్రాంతాల్లోని రైతులు వెద పద్ధతిలో సాగుచేశారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి



అప్పారావు మృతదేహం

సాక్షిప్రతినిధి,గుంటూరు/నెహ్రూనగర్: కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్వాకానికి ఒక నిండు ప్రాణం బలైంది. ఒక పక్క కుండపోత వర్షాలు కురుస్తున్న సమయంలో పీకలవాగుపై చప్టాకి స్లాబ్ వేయాలన్న నిర్ణయం ఎవరిదన్న విషయం తేలాల్సి ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని పీకలవాగు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రవహించింది. ఈ వాగుపై వేసిన సెంట్రింగ్ గట్టితనం ఎంత ఉందనే విషయాన్ని పరిశీలించకుండానే మంగళవారం స్లాబ్ వేయాలని నిర్ణయించారు. అది కూడా 18 అంగుళాలు వేయడంతో బరువు తట్టుకోలేక స్లాబ్ కుప్పకూలింది. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా పనులు చేయడం వెనుక కార్పొరేషన్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. నగరంలోని 34వ డివిజన్ పరిధిలోని దేవాపురం 4వ లైనులో పీకలవాగుపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరువైంది. దాని స్థానంలో కొత్తది నిర్మించేందుకు నిర్ణయించారు. రూ.8 లక్షలతో నూతన కల్వర్టు పనులను ఇంజినీరింగ్ అధికారులు చేపట్టారు. కొద్ది రోజులుగా వర్షం పడుతున్నప్పటికీ కాంట్రాక్టర్‌పై అధికారులు ఒత్తిడి తీసుకురావడంతో మంగళవారం స్లాబ్ వేశారు. అది పూర్తయిన తరువాత కింద పెట్టిన సెంట్రింగ్ కర్రలు పరిశీలించేందుకు గుంటూరు నగరం గోరంట్లకు చెందిన తోట అప్పారావు వెళ్లాడు. అకస్మాత్తుగా సెంట్రింగ్ కర్రలు కదిలి స్లాబ్ పడిపోయింది. ఊపిరి ఆడక అప్పారావు మృతి చెందాడు.

వాన పడుతుంటే పనులా?

మూడు రోజులుగా నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కానీ కాంట్రాక్టర్, అధికారుల వైఖరితో మంగళవారం హడావుడిగా స్లాబ్ వేశారు. వాగులో నిరంతరం మురుగు పారుతున్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. తూతూ మంత్రంగా పనులు చేయడంతో ఆకస్మాత్తుగా ప్రమాదంలో కార్మికుడు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. మామూలుగా ఇళ్లకు 4 నుంచి 5 అంగుళాలు స్లాబ్ వేస్తారు. కల్వర్టు వద్ద మహా అయితే 8 అంగుళాలు శ్లాబ్ వేస్తారు. కానీ ఇప్పుడు దుర్ఘటన జరిగిన పీకలవాగుపై 18 అంగుళాలు మందం స్లాబ్ వేసినట్లు సమాచారం. అలా వేయాలంటే కింద ఐరన్ సెంట్రింగ్ ఉండాలి. ఇక్కడ చెక్క సెంట్రింగ్ వాడటంతో ప్రమాదం జరిగిందని వర్కర్లు చెబుతున్నారు.

నాణ్యతకు పాతర

గుంటూరు నగరంలో జరిగే వర్కులను టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లే చేయాలని హుకుం జారీ చేస్తు న్నారు. ఎవరైనా తమని కాదని వర్కులు చేస్తే బిల్లులు ప్రాసెస్ కానివ్వబోమని బెదిరిస్తున్నారు. చాలా మంది కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఏ పనైనా నాణ్యతా ప్రమాణాలు లేకుండానే చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం 'సాక్షి' దినపత్రికలో కూడా 'టెండర్లన్నీ కొట్టేసి.. పనుల్లో నొక్కేసి..' అనే కథనం ప్రచురితమైంది. అధికారులు మాత్రం పచ్చ కాంట్రాక్టరే జీ హుజూర్ అంటూ వారి చేసిన వర్కుల్లో నాణ్యత లేకపోయినప్పటికి కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరికి కాంట్రాక్టర్‌తో బాధిత కుటుంబానికి రూ. ఐదు లక్షల పరిహారం ఇప్పించేందుకు ఒప్పించారు.

కాంట్రాక్టర్‌దే బాధ్యత

జీజీహెచ్‌లో మృతదేహాన్ని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన కమిషనర్ పులి శ్రీనివాసులు అంతా కాంట్రాక్టర్‌దే బాధ్యత అన్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

రేవులో పడి వ్యక్తి మృతి


మృతుడు బాలకోటయ్య

నిజాంపట్నం: వేటకు వెళ్తూ ప్రమాదవశాత్తు రేవులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇది. అడవులదీవి ఎస్‌ఐ బాబూరావు వివరాల మేరకు కొత్తపాలెం పంచాయతీ శారదానగర్‌కు చెందిన బాలకోటయ్య (23) సముద్రంలో వేటకు వెళ్ళేందుకు సోమవారం రేవులో పడవపై వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి రేవులో పడ్డాడన్నారు. గల్లంతైన బాలకోటయ్య మృతదేహాన్ని మంగళవారం రేవు ఒడ్డున గుర్తించామన్నారు. మృతుని సోదరుడు బాల శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టైలర్ షాపు దగ్ధం

మేదరమెట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ సమీపంలోగల టైలర్ దుకాణం సోమవారం అర్ధరాత్రి మంటల్లో కాలిపోయింది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు.. సోమవారం రాత్రి దుకాణం తలుపులు వేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో స్థానికులు ఫోన్ చేసి షాపులో మంటలు వస్తున్నాయని చెప్పటంతో అక్కడకు వచ్చేసరికి దుకాణం పూర్తిగా కాలిపోయింది. దుకాణంలో ఉన్న బట్టలు, సామాగ్రి దగ్ధమయ్యాయని.. వాటి విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని వాపోయాడు.

లారీని ఢీ కొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు



మేదరమెట్ల: ఆగిఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన టాటాఏస్ ఆటో ఢీ కొన్న సంఘటన జాతీయ రహదారిలోని పి.గుడిపాడు గాజు ఫ్యాక్టరీ వద్ద మంగళవారం జరిగింది. బెంగళూరు నుంచి విజయవాడకు వెళుతున్న కొరియర్ లారీ పి.గుడిపాడు జాతీయరహదారి గాజు ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంది. ఒంగోలు వైపు నుంచి వస్తున్న టాటా ఏస్ ఆటో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన ఆటో ఆగిఉన్న లారీని ఢీ కొంది. దీంతో లారీలోని డ్రైవర్‌కు.. ఆటో డ్రైవర్‌కు గాయాలు కాగా 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

10 మంది వైఎస్సార్ సీపీ నేతల విచారణ

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారంటూ నమోదైన అక్రమ కేసులో 10 మంది వైఎస్సార్ సీపీ నేతలను మంగళవారం సత్తెనపల్లిటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగమల్లేశ్వరరావు విచారించారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది పెండెం బాబురావుతో పాటు నాయకులు జూపల్లి పాల్, జడా ప్రసాద్, కూకుట్ల శ్రీనివాసరావు, అజయ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పవన్‌కుమార్, ప్రమోద్,వినోద్, ఉల్లం.శ్రీనులను విచారించారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి
- రేంజ్‌కు 53 మంది పీఎస్‌ఐలు కేటాయింపు

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయతీ, సేవాతత్పరతతో మెలగాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ సివిల్ ఎస్‌ఐ (పీఎస్‌ఐ)లు 53 మంది మంగళవారం గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని గుంటూరు రేంజ్ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని మర్యాద పూర్వకంగా కలిశారు. పీఎస్‌ఐలను ఉద్దేశించి ఐజీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్లను నిర్వహించే విధానాలు, రికార్డులు, చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం 53 మంది ఎస్‌ఐలలో 36 మంది పురుషులు, 17 మంది మహిళా ఎస్‌ఐలు రిపోర్ట్ చేశారు. గుంటూరు జిల్లాకు 23, పల్నాడు జిల్లాకు 13, బాపట్ల జిల్లాకు 10, ప్రకాశం జిల్లాకు ఒక్కరు చొప్పున, శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లాకు ముగ్గురు, తిరుపతికి ముగ్గుర్ని కేటాయించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


పీఎస్‌ఐలతో మాట్లాడుతున్న సర్వశ్రేష్ఠత్రిపాఠి

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

నగరంపాలెం: ప్రొబేషనరీ సివిల్ ఎస్‌ఐ (పీఎస్‌ఐ)లు సమర్థంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గుంటూరు జిల్లాకు కేటాయించిన 23 మంది పీఎస్‌ఐలు, ఉద్యోగోన్నతి పొందిన ఆరుగురు ఎస్‌ఐలు మంగళవారం నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన, సేవా గుణం కీలకమని అన్నారు.


పీఎస్‌ఐలు, ఎస్‌ఐలతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పీ-4 లక్ష్యం పేదరిక నిర్మూలన

పర్చూరు(చినగంజాం): పేదరిక నిర్మూలన పీ-4 లక్ష్యం అని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న పేర్కొన్నారు. జీరో ప్రాపర్టీ పీ 4 కార్యక్రమంలో భాగంగా మండలంలోని నూతలపాడు గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. జనాభాలో అత్యంత సంపన్నులైన 10 శాతం మంది.. పేద కుటుంబాల్లో దిగువనున్న 20 శాతం మంది పేదలకు మద్దతు ఇవ్వాలన్నారు. పీ4 ప్రభుత్వ, ప్రయివేట్ ప్రజల భాగస్వామ్యాన్ని సూచిస్తుందన్నారు. దీని కోసం విరాళమివ్వడానికి సిద్ధంగా ఉన్న సంపన్న వ్యక్తులను మార్గదర్శకులు అంటారని, నిరుపేద లబ్ధిదారులను బంగారు కుటుంబంగా గుర్తిస్తారని తెలిపారు. మార్గదర్శి కుటుంబాలు చూపే బాటలో బంగారు కుటుంబాలు అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, తహసీల్దార్ పి. బ్రహ్మయ్య, నూతలపాడు సర్పంచ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ లవన్న

కక్ష సాధింపుతోనే మిథున్‌రెడ్డి అరెస్ట్


అంజనీప్రసాదరెడ్డి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగానే వైఎస్సార్‌సీపీ ముఖ్యనేత, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి అంజనీప్రసాదరెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలే టార్గెట్‌గా కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందన్నారు. చంద్రబాబు సర్కార్ బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు భయపడరన్నారు. ఎంత మందిపైన అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినా పార్టీశ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం నెలకొంటుందన్నారు. కూటమి ఏడాది పాలనపట్ల ప్రజల్లోనేకాక కూటమి శ్రేణుల్లోనే వ్యతిరేకత మొదలైందన్నారు.

ఈసీ మార్గదర్శకాలను అమలు చేయాలి

డీఆర్వో షేక్ ఖాజావలి

గుంటూరు వెస్ట్: భారత ఎన్నికల సంఘం గతంలో నిర్వహించిన విధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించిన ఓటర్ల జాబితాను రూపొందించాలన్న ఆలోచనలో ఉందని జిల్లా రెవెన్యూ అధికారి షేఖ్ ఖాజావలి తెలిపారు. దానికి అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ.. దీనిపై త్వరలోనే ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విడుదల చేస్తుందన్నారు. పూర్తి సమాచారం అందిస్తామని తెలిపారు. పోలింగ్ బూత్‌లలో 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా, అదనంగా ఉండే ఓటర్లను సమీపంలోని పోలింగ్ బూత్‌లలో సర్దుబాటు చేసేలా ప్రక్రియను ప్రాథమికంగా పూర్తి చేశామన్నారు. దీనిపై నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలతో చర్చించి ఆమోదం కోసం ఎన్నికల సంఘానికి పంపిస్తామని తెలిపారు. బీఎల్వోల మార్పుచేర్పులకు ఇక నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. దీనికోసం ఈ నెల 31వ తేదీ నాటికి వివరాలు ఎన్నికల సంఘానికి పంపిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీలు నియమించే బూత్ లెవెల్ ఏజెంట్ నియామకాలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆమోదం తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్ఏల వివరాలు అందించాలని డీఆర్వో వివరించారు. సమావేశంలో విపత్తులు నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మీకుమారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగారాజు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జీఎంసీ అడిషనల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మల్లేశ్వరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న షేఖ్ ఖాజావలి

దమ్మనవారిపాలెంలో భారీ చోరీ

కర్లపాలెం: దమ్మనవారిపాలెంలో భారీ చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్లపాలెం ఎస్‌ఐ జి.రవీంద్ర తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన పిట్ల పెద వెంకటరెడ్డి కుటుంబంతో ఈనెల 17వ తేదీన పాండిచ్చేరిలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్ళాడు. ఈనెల 20వ తేదీన పెద వెంకటరెడ్డి ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండటంతో గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఈనెల 21వ తేదీన వెంకటరెడ్డి స్వగ్రామానికి వచ్చి ఇంటిని పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువా లాకరులో ఉన్న 141 గ్రాముల బంగారం, అరకిలో వెండి, రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాపట్ల రూరల్ సీఐ హరిబాబు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని క్లూస్ టీమ్స్ పిలిపించి వేలిముద్రలు సేకరిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


చోరీ జరిగిన ఇంటిలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, సీఐ హరిబాబు. ఎస్‌ఐ రవీంద్ర

రెచ్చిపోయిన దొంగలు

కిటికీలు, కప్‌బోర్డులు ధ్వంసం చేసి సొత్తు అపహరణ

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరులో మంగళవారం ఉదయం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. స్థానిక కొణిదెన రోడ్డులో నివాసం ఉండే కొండముది కళ్యాణి మూడు రోజుల క్రితం తమ ఇంటికి తాళం వేసుకొని కాశీ యాత్రకు బయలుదేరి వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు కళ్యాణి ఇంటి కిటికీలు ధ్వంసం చేసి లోనికి చొరబడ్డారు. అనంతరం ఇంట్లోని బీరువా, కప్ బోర్డులను సైతం ధ్వంసం చేసి అందులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు కొంత నగదును చోరీ చేశారు. మంగళవారం ఉదయం చోరీ విషయాన్ని గమనించిన సమీప బంధువులు కాశీ యాత్రలో ఉన్న కళ్యాణికి, పోలీసులకు సమాచారం అందించారు. బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం బృందం కళ్యాణి నివాసాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కాశీ యాత్ర విరమించుకొని తిరుగు ప్రయాణమైన కళ్యాణి మార్టూరు వచ్చిన అనంతరం పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.


దొంగలు ధ్వంసం చేసిన కళ్యాణి ఇంటి లోపల భాగం

ఆర్టీఐ అర్జీలకు సకాలంలో సమాచారం అందించాలి


మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి వెంకట్రావు

నరసరావుపేట రూరల్: ఆర్‌టీఐ అర్జీలకు సకాలంలో సమాచారం అందించే బాధ్యత అధికారులతో పాటు సిబ్బందిపై ఉందని జిల్లా ఉద్యాన అధికారి ఎ.వెంకట్రావు తెలిపారు. జిల్లా ఉద్యాన కార్యాలయంలో మంగళవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఆర్‌టీఐ ద్వారా ప్రభుత్వ వ్యవస్థ, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న కార్యక్రమాలను ఈ చట్టం ద్వారా ప్రజలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా పాలనలో పారదర్శకతకు అవకాశం ఉంటుందని వివరించారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట బి.వెంకటేశ్వరరావు, ఉద్యాన అధికారులు, కార్యాలయ సిబ్బంది, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగలకొట్టి చోరీ

రెండు ల్యాప్‌టాప్‌లు, నగదు అపహరణ

మంగళగిరి టౌన్ : రెండు వేర్వేరు కారుల అద్దాలు పగలకొట్టి ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన ఘటన మంగళగిరిలో మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు డీబీఎస్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హెడ్ శ్రీనివాస్ సిల్వరాజ్ విధులు నిమిత్తం విజయవాడ బ్యాంకుకు వచ్చారు. అక్కడ పని ముగించుకుని విజయవాడ క్లస్టర్ హెడ్ సుధాకర్‌తో పాటు తన సిబ్బందితో గుంటూరు బ్యాంకుకు బయలుదేరారు. ఈ క్రమంలో మధ్యాహ్నం భోజనం చేసేందుకు చినకాకానిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న భోజన హోటల్ వద్ద ఆగారు. అదే సమయంలో బద్వేల్‌కి చెందిన సాయిరాం అనే యువకుడు తన కుటుంబ సభ్యులతో ఎర్రబాలెంలో తాను కొనుగోలు చేసిన స్థలం చూడడానికి వచ్చి భోజనం చేసేందుకు వీరు కూడా వారి కారులో హోటల్‌కు చేరుకున్నారు. వీరిద్దరూ కార్లను పార్కింగ్ చేసి భోజనం చేయడానికి లోపలికి వెళ్లారు. భోజనం చేసి అనంతరం బయటకు వచ్చి చూడగా కారు అద్దాలు పగలకొట్టి ఉండడం గమనించారు. కారు లోపల పెట్టిన ల్యాప్‌టాప్, బ్యాగులు అపహరణకు గురిఅయినట్లు గుర్తించారు. శ్రీనివాస్ సెల్వరాజ్ కారులో ల్యాప్‌టాప్‌తో పాటు క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు ఉన్నాయని, సాయిరామ్ కారులో ల్యాప్‌టాప్‌తో పాటు సుమారు 5 వేల రూపాయలు నగదు, ఇంటి తాళాలు, బీరువా తాళాలు ఉన్నట్లు చెప్పారు. ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.


కారు అద్దాలు పగలకొట్టి బ్యాగ్‌ను చోరీ చేసి తీసుకెలుతున్న వ్యక్తి


దుండగులు పగలగొట్టిన కారు అద్దం

రైలు ఢీకొని ఉద్యోగి మృతి

తెనాలి రూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు ఆర్ అండ్ బీ శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న జాన్‌బాబు(50) మంగళవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. జాన్‌బాబు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఘటనాస్థలిని రైల్వే పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్‌ఐ జి. వెంకటాద్రిబాబు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి


దినేష్ మృతదేహం

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన దినేష్ (20) మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం కళాశాల నుంచి తన స్నేహితుడు గణేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గుంటూరుకు బయలుదేరాడు. చౌడవరం వద్ద హైవేపై డివైండర్ రైలింగ్‌కు ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ఢీకొంది. దినేష్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు వచ్చి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మృతుని తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఒకరోజు శాస్త్రవేత్తలుగా పాఠశాల విద్యార్థులు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9వ తరగతుల విద్యార్థులు ఐదుగురు జాతీయ స్థాయి వన్డే యాజ్ ఏ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం లింగిశెట్టి సాంబయ్య మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన బి.అనుశ్రీ,, షేక్ ఖాసీం, షేక్ మస్తాన్‌వలి, కె.ప్రశాంత్, షేక్ అన్వర్‌లను ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షల్లో ఎంపిక చేశారని చెప్పారు. జిజ్ఞాసా ప్రోగ్రామ్‌లో భాగంగా దేశంలో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), అంతర్జాతీయ స్థాయి పరిశోధన సంస్థ (భువనేశ్వర్)లో ఈ నెల 24న విద్యార్థులు అక్కడున్న శాస్త్రవేత్తలతో కలిసి పనిచేస్తారని తెలిపారు. విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.నాగరాజులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రామాంజనేయులు, రాజులు పాల్గొన్నారు.

పేకాటపై పోలీసులు మెరుపుదాడి

చిలకలూరిపేటటౌన్: మండలంలోని కుక్కపల్లివారిపాలెం గ్రామ శివారులోని పొలాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐ జి. అనిల్ కుమార్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం దాడులు చేపట్టారు. అదుపులోకి తీసుకున్నవారి వద్ద నుంచి రూ.3,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నదాత సుఖీభవ పథకంపై గ్రీవెన్స్‌కు అవకాశం


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

నరసరావుపేట రూరల్: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈనెల 23వ తేదీ బుధవారం లోపు రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుని వద్ద గ్రీవెన్స్ పెట్టవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల, అల్లూరివారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ పంట సాగు చేసే కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో వరి పంటకు ఎకరానికి రూ.80లు ప్రీమియం చెల్లించి ఆగస్టు 15వ తేదీ కల్లా ఇన్స్యూరెన్స్ చేసుకోవాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతురావు, ఏఓ ఐ.శాంతి, ఏఈవో బ్రహ్మయ్య, వీఏఏ సామంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా యాత్ర



సత్తెనపల్లి: త్రివర్ణ పతాకాన్ని జాతీయ జెండాగా భారత రాజ్యాంగ సభ 1947 జూలై 22న ఆమోదించిన సందర్భంగా హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి)ఆధ్వర్యంలో నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో 108 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా యాత్ర ర్యాలీ మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడుతూ.. జాతీయ జెండా భారత దేశం యొక్క సార్వభౌమత్వం, ఐక్యతకు చిహ్నమన్నారు. సత్తెనపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆళ్ల సాంబయ్య మాట్లాడుతూ త్రివర్ణ పతాకం భారతీయులకు అందించిన పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. తొలుత పంచాయతీ కార్యాలయం దగ్గర ఉన్న మహనీయుల విగ్రహాలకు నివాళులర్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, పాఠశాల పీడీ సాంబశివరావు, చెంబేటి బొల్లయ్య, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు అక్షయ్, నిర్మల్ కుమార్, జాతీయ జెండా వేషధారి శేఖర్, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, వాణి, జ్యోతి, అమల, గౌసియా, విద్యార్థులు పాల్గొన్నారు.